సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం | 27 | సెప్టెంబర్ | 2024



నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

వేములవాడ: రాజన్న సన్నిధిలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే దేవీ నవరాత్రోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



చెత్తపై సమరం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బల్దియా పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకెళ్తోంది. స్వచ్ఛకీర్తిని నిలబెట్టుకునేందుకు చెత్తపై యుద్ధమే చేస్తుంది. ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

ఆగిన 'అభివృద్ధి'!

- నిధులున్నా నిలిచిన 795 పనులు
- పనుల విలువ రూ.24.21కోట్లు
- నివేదిక కోరిన కలెక్టర్



ఈ స్థలం ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ సంఘానిది. 2018లో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.5లక్షలను సీడీపీ ద్వారా మంజూరుచేశారు. భవన నిర్మాణం కోసం సంఘం చూపిన స్థలంలో ఇప్పటి వరకు అక్కడ పనులు మొదలవ్వలేదు. పాత భవనంలో సమావేశాలు నిర్మించుకోక, కొత్త భవనం పనులు మొదలుకాక ఎస్సీ కమ్యూనిటీ పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు.



ముస్తాబాద్‌లో సగంలో నిలిచిన అంగన్‌వాడీ భవనం

ముస్తాబాద్(సిరిసిల్ల): అధికారుల పర్యవేక్షణ లోపం.. పాలకుల ఉదాసీనత వెరసి అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కొన్ని గ్రామాల్లోనైతే పనులే మొదలుకాలేదు. నిధులున్నా పనులు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధుల ద్వారా చేపట్టిన పనులు మందకొడిగా సాగాయి. జిల్లాలో నియోజకవర్గాల అభివృద్ధికి రూ.51.85కోట్లు మంజూరు చేశారు. ఇందుకు 1,833 పనులు చేపట్టారు. అయితే 795 పనులు ఆగిపోయాయి.

ఒక అడుగు ముందుకు..
రెండడుగుల వెనక్కి !

నియోజకవర్గాల అభివృద్ధికి పదేళ్లలో మంజూరుచేసిన రూ.51.85 కోట్ల పనుల్లో ఇప్పటి వరకు రూ.16.98కోట్లతో 738 పనులు మాత్రమే పూర్తిచేశారు. అలాగే రూ.8.46కోట్లతో చేపట్టిన 300 పనులు ప్రగతిలో ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. ఇంకా రూ.24.21కోట్లతో చేపట్టిన 795 పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

పనుల నివేదికకు కలెక్టర్ ఆదేశాలు

నియోజకవర్గాల అభివృద్ధికి గత పదేళ్లలో చేపట్టిన పనుల వివరాల నివేదికలు అందజేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలిచ్చారు. దీంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పంచాయతీరాజ్, విద్యాశాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖల్లో చేపట్టిన పనులు మందకొడిగా సాగడానికి గల కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్య, వైద్యశాఖల్లో ఖర్చు చేసిన పనులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించనందున పనులు రికార్డుల్లోకి ఎక్కలేదని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు. 795 పనులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు.

వివిధ శాఖల్లో చేపట్టిన పనులు

పంచాయతీరాజ్, విద్య, వైద్యారోగ్యశాఖలు, మున్సిపల్, మిషన్ భగీరథ పథకాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులు కేటాయించారు. సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువుల ఆస్పత్రులు, పంచాయతీ భవనాల పనులు చేపట్టారు. ఇందులో చాలామటుకు కమ్యూనిటీ భవనాల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్టీల్, సిమెంట్, ఇసుక, ఇతర సామగ్రి ధరలు పెరగడంతో పనులు పూర్తి చేయకపోవడం, మరోవైపు చేసిన పనులకు బిల్లులు రాక చాలామంది ఇబ్బందులు పడ్డారు.

పనులు మొదలు పెట్టలేదు



2018లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నేను సర్పంచ్‌కాగానే ఆ నిధులతో పనులు చేసేందుకు ప్రయత్నించినా ఎవరు సహకరించలేదు. కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిన స్థలం ఖాళీగానే ఉంది.

– లక్ష్మి, మాజీ సర్పంచ్, కొండాపూర్

నిధులు సరిపోలేదు



ముస్తాబాద్‌లో సీడీపీ నిధులతో చేపట్టిన పద్మశాలీ భవన్ నిర్మాణ పనులకు నిధులు సరిపోలేదు. దీంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మిగులు పనులకు రూ.15లక్షలు మంజూరు చేస్తేనే పూర్తవుతాయి. బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారు. పదేళ్లయినా పనులు పూర్తి కావడం లేదు.

– గూడూరి భరత్, ముస్తాబాద్

బిల్లులు రాలేదు



రామలక్ష్మణపల్లెలో సీడీపీ నిధులతో అదనపు తరగతిగది, కమ్యూనిటీహాల్, జీపీ అదనపు పనులు చేపట్టాం. అప్పులు చేసి పనులు చేసిన బిల్లులు ఇవ్వలేదు. ఆవునూర్‌లో ముదిరాజ్ భవనానికి నిధులు సరిపోలేదు.

– దమ్మ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కేటీఆర్, మేడిపెల్లి సత్యం

- రాజకీయాలకు అతీతంగా కొదురుపాక అభివృద్ధి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- స్కూల్ భవనం ప్రారంభం

సిరిసిల్ల/బోయినపల్లి(చొప్పదండి)/సిరిసిల్లటౌన్: మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే సత్యంతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో తన అమ్మమ్మ–తాతయ్యలు జోగినిపల్లి లక్ష్మీబాయి–కేశవరావుల స్మారకార్థం నిర్మించిన పాఠశాల భవనాన్ని గురువారం ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిర్వాసితుల కష్టాలు తమ కుటుంబానికి బాగా తెలుసునని పేర్కొన్నారు. గుడి నిర్మాణానికి సహకారం అందిస్తానన్నారు. కొదురుపాకతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే సత్యం మావాడే.. మా కోరుట్లపేట వాసి.. మా నియోజకవర్గ ఓటర్.. అని అన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తెలంగాణ

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో విద్య కమిషన్ ఏర్పాటు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్భుతమైన స్కూల్ నిర్మించినందుకు కేటీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

సమావేశం ముగిశాక చివరిలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అనుముల భాస్కర్ మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కలుగజేసుకుని ఇరువురిని పక్కకు తీసుకెళ్లడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

ఐలమ్మ జీవితం ఆదర్శం

తెలంగాణ మహిళలకు చిట్యాల ఐలమ్మ జీవితం, ఆమె పోరాట పటిమ ఆదర్శమని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. పట్టణ రజక సంఘం, బీఆర్ఎస్ ఆఫీస్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

చీరల ఆర్డర్లు ఇవ్వాలి

సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి, నేతన్నలను ఆదుకోవాలని కేటీఆర్ కోరారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏడేళ్లలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, కేవలం రూ.200 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. మా ప్రభుత్వం మళ్లీ వస్తుందనుకున్నామని, వచ్చిన వెంటనే బకాయిలు ఇద్దామని భావించామన్నారు. మోసపు మాటలు, అబద్ధాలతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. స్థానిక వస్త్రపరిశ్రమ తిరుపూర్ తరహాలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కోపంతో నేతన్నలను గోసపెడుతుందన్నారు. మహిళలకు ఇస్తామన్న రెండు చీరల ఉత్పత్తి ఆర్డర్లను స్థానిక నేతన్నలకు ఇవ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత



సిరిసిల్లకల్చరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత కోరారు. కోర్టు ప్రాంగణంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో కక్షిదారులు రాజీమార్గం అనుసరిస్తే సత్వర పరిష్కారానికి వీలు కలుగుతుందన్నారు. సివిల్ కేసుల్లో కక్షిదారులు పరస్పర అవగాహనతో పరిష్కారానికి ముందుకొస్తే కోర్టు ఫీజులు తిరిగి ఇవ్వబడతాయన్నారు. అదాలత్‌లో పరిష్కారమైన కేసుల విషయంలో అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రాధికా జైస్వాల్, చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటురంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలి



సిరిసిల్లఅర్బన్: ప్రైవేట్ రంగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దుండ్రపల్లి రవీందర్ కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు గురువారం వినతిపత్రం అందించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ అమలుతోపాటు రాష్ట్ర జనాభా ఆధారంగా బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు సబ్సిడీ నిధులు విడుదల చేయాలని కోరారు. మంద సుదర్శన్, సొదాయ కపిల్, శ్యామం మల్లన్న, పడిగె శ్రావణి పాల్గొన్నారు.

విదేశాల్లో ఉపాధి అవకాశాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పారిశ్రామిక విద్య, ఇంజినీరింగ్ చదివిన వారికి విదేశాల్లో మంచి వేతనంతో ఉపాధి పొందే అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత గురువారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రుమేనియా, యూకే, యూఏఈ దేశాల్లో ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివి 2 నుంచి 4 ఏళ్ల అనుభవం గల 45ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు టామ్‌కామ్ తెలంగాణ వెబ్‌సైట్, 9985483931, 7995957779, 7893566493 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోకిరీ చేష్టలు చేస్తే కఠిన చర్యలు

- ఏఎస్పీ చంద్రయ్య



సిరిసిల్లక్రైం: జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, పోకిరీ చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న 22 మంది ఆకతాయిలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికే మహిళలు, విద్యార్థినులను వేధించి వారిపై 37 కేసులు, 40 పెట్టి కేసులు పెట్టామన్నారు. వేధింపులకు గురైతే షీటీమ్ 87126 56425, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. షీటీమ్ ఏఎస్సై ప్రమీల, మహిళా కానిస్టేబుల్ ప్రియాంక ఉన్నారు.

ప్రజలతో మాది ఫెవికాల్ బంధం

- ఎన్నికల్లో బుద్ధిచెప్పినా.. కేటీఆర్ అహంకారం తగ్గలే..
- ఇంకా పదేళ్లయినా మీకు అధికారం రాదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: ప్రజలతో మాది ఫెవికాల్ బంధమని, సీఎం రేవంత్‌రెడ్డి మగాడు కాబట్టే మిమ్మల్ని, మీ అధికారాన్ని గద్దె దింపాడని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నేతన్నలపై మొసలి కన్నీరు కార్చుతున్నాడని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చినా ఇంకా బుద్ధిరాకుండా.. అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మీరు చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులను ప్రజల ముందుంచారని, కాళేశ్వరం అవినీతిని బట్టబయలు చేశారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో మీరు చేసిన అక్రమాలు, ఫైల్స్ మాయం చేసిన వైనాన్ని బయటపెడతామన్నారు. సిరిసిల్ల నేతన్నలకు మీరు ఇవ్వాల్సిన డబ్బులను తమ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేతన్నలకు సకాలంలో డబ్బులు ఇవ్వకుండా.. వస్త్రోత్పత్తిదారులు మీ వద్దకు వస్తే.. వాళ్ల జుట్టు మీ చేతుల్లో పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధిపొందింది మీరేనని ఆరోపించారు. నేతన్నలను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మీరు కోటి చీరలు పంచితే.. మేము కోటి 30 లక్షల చీరలను నాణ్యమైన చీరలను అందించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు, 200 యూనిట్ల గృహవిద్యుత్, రూ.500లకే సిలిండర్ ఇస్తున్నామని, రైతుల రుణాలను మాఫీ చేశామని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే అన్నీ అయిపోతాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని ఆది శ్రీనివాస్ అన్నారు. నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, వెల్ముల స్వరూప, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, కత్తెర దేవదాస్, జాల్గం ప్రవీణ్, ఆడెపు చంద్రకళ, గోలి వెంకటరమణ, గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లు ఘనంగా చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఆలయ అధికారులు, అర్చకులతో ప్రత్యేక సమావేశం



సమావేశమైన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ: రాజన్న సన్నిధిలో నిర్వహించే దేవి నవరాత్రోత్సవాలు, పట్టణంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలు గతంలో కంటే ఘనంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అలయ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి చైర్మన్ చాంబర్‌లో గురువారం ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ప్రధానార్చకులు ఉమేశ్‌శర్మ, శరత్‌శర్మలతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరిగే దేవీ నవరాత్రోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా అలంకరించాలన్నారు. పట్టణంలోని మహిళలు ఆలయ ఆవరణలో ఆటాడుకునే సాంప్రదాయం అనాదిగా వస్తుందని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

రేషన్ నియామకాలపై విజి'లెన్స్'

సాక్షి ఎఫెక్ట్

- ఆర్డీవో ఆఫీసులో తనిఖీలు
- తహసీల్దార్ షరీఫొద్దీన్‌కు బదిలీ ఉత్తర్వులు
- సిరిసిల్ల తహసీల్దార్‌గా ఉమారాణి



సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసులో విజిలెన్స్ తనిఖీలు

సిరిసిల్లటౌన్: జిల్లాలో రేషన్‌డీలర్ల నియామకాలపై సాక్షిలో ప్రచురించిన 'లీడర్లే..డీలర్లు!' అనే కథనం ప్రకంపనాలు సృష్టించింది. వరుసగా మూడు రోజులుగా సిరిసిల్లలో చోటు చేసుకున్న పరిణామాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి శశిధర్, డీఎస్పీ ప్రభాకర్ సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసులో తనిఖీలు చేపట్టారు. రేషన్‌డీలర్ల నోటిఫికేషన్ మొదలు పరీక్ష నిర్వహణ, అభ్యర్థుల ఎంపికాంశాలపై విచారించినట్లు సమాచారం.

తహసీల్దార్ షరీఫొద్దీన్ బదిలీ

సిరిసిల్ల తహసీల్దార్ షరీఫొద్దీన్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వీర్నపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఉమారాణిని నియమించారు. డీలర్ల నియామకాలపై వెల్లువెత్తుతున్న నిరసనలు తదితర అంశాలతోనే తహసీల్దార్ల మార్పులు జరిగినట్లు చర్చ సాగుతోంది.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆమె ఆశయసాధనకు ముందుకుసాగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఐలమ్మ 129వ జయంతి ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎస్.భీమ్యానాయక్ జ్యోతి వెలిగించి, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని, తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావితరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని చూపిందన్నారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజమనోహర్, ఎల్‌డీఎం మల్లికార్జున్, పరిశ్రమలశాఖ ఏడీ భారతి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

మా షాపులు మాగ్గావాలి

- ఇన్నాళ్లు వాటినే నమ్ముకొని బతికాం
- ఇప్పుడు రద్దు చేస్తే ఎలా ?
- పిల్లాపాపలను ఎలా సాదుకోవాలి ?
- సిరిసిల్లలో వాటర్ ట్యాంకెక్కిన మాజీ రేషన్ డీలర్లు



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లటౌన్: 'ఏళ్లుగా రేషన్‌షాపులను నడుపుకొని బతికాం.. ఇప్పుడు రద్దు చేస్తే బతికేది ఎలా..? మా షాపులు మాగ్గావాలి'అంటూ మాజీ రేషన్‌డీలర్లు సిరిసిల్లలో గురువారం నిరసన చేపట్టారు. కొత్త బస్టాండ్ సమీపంలోని వాటర్‌ట్యాంక్ ఎక్కారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా షాపులను నడిపించే మాలాంటి నలభై మందిపై కత్తికట్టి డీలర్‌షిప్‌లను వేరేవాళ్లకు ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొత్తగా రేషన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలపై వారు నిరసనగళం విప్పారు.

నాలుగు గంటలు హైరానా..

జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో మున్సిపల్ తాగునీటి ట్యాంకు ఎక్కిన మాజీ రేషన్‌డీలర్లు నాలుగు గంటలపాటు దిగిరాలేదు. తమకు న్యాయం కావాలంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. ట్యాంకుపైకి అధికారులు, పోలీసులు ఎవరూ రావొద్దంటూ నినాదాలు చేశారు. తమకు సమాచారం లేకుండానే డీలర్‌షిప్‌లు రద్దు చేసి కొత్త వారి కోసం నోటిఫికేషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మూడు రోజుల క్రితం రాత్రికి రాత్రే కొత్తవారికి ప్రొసీడింగ్స్ ఎలా ఇస్తారని నిలదీశారు.

నిరసన కారులతో మాట్లాడిన ఏఎస్పీ చంద్రయ్య

ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న వారితో ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లి పరిష్కారం చూపేలా కృషి చేస్తామన్నారు. అధికారులు, అధికార పార్టీ నేతల మూలంగా తాము సర్వస్వం కోల్పోయామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూడాలని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణలను ఆదేశించారు.

తహసీల్దార్ హామీ విశ్వసించని వైనం

తహసీల్దార్ షరీఫొద్దీన్ వారించినా వినలేదు. కలెక్టర్, ఆర్డీవోలు వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ పెట్రోల్‌బాటిల్‌తో నినాదాలు చేశారు. చివరికి రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు వచ్చి న్యాయపోరాటం చేస్తున్నామని ఆందోళనకారులతో మాట్లాడటంతో ట్యాంకు దిగి వచ్చారు. నిరసన చేపట్టిన వారిలో కొండ పద్మ, మమత, పద్మ, రేఖ, శ్రీనివాస్ ఉన్నారు.

న్యాయం కావాలి



పన్నెండేళ్లుగా రేషన్ షాపులు నడిపిస్తున్నాం. నాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఉన్న ఫలంగా ఉపాధిని తొలగిస్తే ఎలా. మాకు న్యాయం చేయాలి. కలెక్టర్ స్పందించి మాకు రేషన్‌షాపును కేటాయించాలి.

– రేఖ, తంగళ్లపల్లి

విచారణ చేసుకోండి



మా ఊరు మండేపల్లి. ఇన్నేళ్ల సంది క్రమం తప్పకుండా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నా. మా సేవలపై ఊర్లో ఎంక్వయిరీ చేసుకోండి. ఇప్పుడు రద్దు చేస్తే ఎలా. చిన్న పిల్లలున్నారు.. ఎలా ఇల్లు నడిపించుకోవాలి.

– రిక్కుమల్ల కావేరి, మండేపల్లి

కరోనాలోనూ సేవలందించాం



ఏళ్ల సంది ఊరిలో రేషన్‌షాపు నడిపిన. ఎలాంటి సమాచారం లేకుండా తొలగించి నోటిఫికేషన్‌తో షాపులను వేరే టోళ్లకు ఇచ్చిండ్రు. కరోనా సమయంలో ఎంతో సేవలందించాం. కుటుంబం రోడ్డున పడ్డది, వయస్సు నలభై దాటింది పని ఎవ్వరు ఇస్తలేరు.

– నమిలికొండ బాబు, తిమ్మాపూర్

క్లుప్తంగా

టెస్ట్‌మిల్లింగ్ చేసి బియ్యం ఖరారు చేయాలి

- మిల్లింగ్ చార్జీలను పెంచాలి
- కలెక్టర్‌కు రా రైస్‌మిల్లర్ల వినతి

సిరిసిల్ల: సన్నరకం వడ్లకు టెస్ట్ మిల్లింగ్ చేసి అవుట్ టర్న్ బియ్యాన్ని ఖరారు చేయాలని జిల్లా రా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. గతంలో దొడ్డు వడ్లను 17శాతం తేమతో కొనుగోలు చేశారని, కానీ సన్నవడ్లను అలా చేస్తే మిల్లింగ్‌లో రంగుమారుతుందన్నారు. 14 శాతం తేమ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 57 శాతం మేరకు బియ్యం వస్తాయని, కానీ అధికారులు 67శాతం అవుట్ టర్న్ బియ్యం ఇవ్వాలని గతంలో నిబంధనలున్నాయని రైస్‌మిల్లర్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలతో సన్నధాన్యం టెస్ట్‌మిల్లింగ్ చేసిన తరువాత అవుట్‌టర్న్ బియ్యం పరిమాణాన్ని నిర్ధారించాలని కోరారు. కరెంట్ బిల్లు, హమాలీ కూలీలు, లేబర్ చార్జీలు పెరిగిన కారణంగా మిల్లింగ్ చార్జీలను రూ.150 చెల్లించాలని కోరారు. బియ్యానికి సరిపడా గోదాములు ఏర్పాటు చేయాలని, తొందరగా దింపుకోవాలని, ధాన్యం పాతసంచుల్లో పంపించాలని, బియ్యం సరఫరాకు కొత్త సంచులు ఇవ్వాలని సూచించారు. 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు, డ్రైఏజ్, కస్టోడియన్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. రా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు, ప్రతినిధులు గరిపెల్లి ప్రభాకర్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.రాజిరెడ్డి ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



సిరిసిల్ల: సిరిసిల్లలోని ప్రైవేటు ఆస్పత్రి రికార్డులను, స్కానింగ్ సెంటర్లను జిల్లా ఉప వైద్యాధికారి అంజలి గురువారం తనిఖీ చేశారు. జిల్లా వైద్యాధికారి వసంతరావు ఆదేశాలతో జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నామని, నిబంధనల మేరకు పేషెంట్ల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, పీసీపీఎన్‌టీడీ యాక్టు ప్రకారం నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. స్కానింగ్ కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. స్కానింగ్ నిర్వహించిన పేషెంట్ల వివరాలు నమోదు చేసుకున్నారు. శిక్షణ పొందిన సిబ్బందిని నియమించుకోవాలని, రిసెప్షన్ సెంటర్‌లో అందరికీ కనిపించేలా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి, లింగ నిర్ధారణ బోర్డులను, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లను గోడలపై ప్రదర్శించాలని సూచించారు. హాస్పిటల్ స్కానింగ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. హెచ్‌ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచందర్ ఉన్నారు.

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కారు కొనివ్వలేదని మనస్తాపానికి గురైన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రాగెల్లకు చెందిన బేతపు వంశీ(20) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బేతపు రాజలింగయ్య కుమారుడు వంశీ, తనకు కారు కొనివ్వాలని కోరుతున్నాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఈనెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెండురోజులైనా ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట వద్ద చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు.

‘స్వాహా’కార సంఘం!

- సహకార సంఘాల నిధుల పక్కదారి
- జగిత్యాల జిల్లాలో రూ.7.36 కోట్ల గోల్‌మాల్
- ఆరుగురు సింగిల్ విండో సీఈవోలపై వేటు
- పాలకవర్గాలకు షోకాజ్ నోటీసులు
- నిష్పక్ష విచారణకు మంత్రి తుమ్మల ఆదేశాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లాలోని సహకారం సంఘాల్లో కుంభకోణం ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లాలోని ఆరు సహకార సంఘాలతోపాటు రెండు డీసీఎంఎస్ శాఖల్లో రూ.7.36 కోట్లు గోల్‌మాల్ అయినట్లు సమాచారం. ఇందుకు ఆరుగురు సీఈవోలను బాధ్యులుగా గుర్తించిన ప్రభుత్వం వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే అవకతవకల్లో బాధ్యులైన సహకార సంఘాల పాలకవర్గాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ వంటి ఒక్కటి రెండు సంఘాల సీఈవోలపై కూడా వేటు పడనున్నట్లు సమాచారం. కుంభకోణం విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్ అయ్యారని సమాచారం. ఆయన సూచనల మేరకే అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కూడా మంత్రి తుమ్మల ఆదేశించడంతో ఈ విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఆరు సంఘాల్లో అవకతవకలు..

జిల్లాలోని ధర్మపురి, జైనా, తిమ్మాపూర్, గొల్లపల్లి, నంచర్ల, పెగడపల్లి సహకార సంఘాలతోపాటు డీసీఎంఎస్ ధర్మపురి బ్రాంచ్, డీసీఎంఎస్ గొల్లపల్లి బ్రాంచ్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం.. పెగడపల్లి సహకార సంఘంలో రూ.1,81,45,068, నంచర్ల సహకార సంఘంలో రూ.96,12,148, తిమ్మాపూర్ సహకార సంఘంలో రూ.67,18,387, జైనా సహకార సంఘంలో రూ.1,55,98,449, ధర్మపురి సహకార సంఘంలో రూ.1,62,19,187, గొల్లపల్లి సహకార సంఘంలో రూ.53,58,809 అవకతకవలు జరిగినట్లు తెలిసింది. అలాగే డీసీఎంఎస్ ధర్మపురి బ్రాంచ్‌లో రూ.6,46,377, డీసీఎంఎస్ గొల్లపల్లి బ్రాంచ్‌లో రూ.13,07,456 అవకతవకలు జరిగినట్లు సమాచారం.

ఆరు సంఘాల కార్యదర్శుల సస్పెన్షన్

ఆయా సంఘాల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులను చేస్తూ ఆరు సంఘాల సీఈవోలు జి.ప్రభాకర్ (తిమ్మాపూర్), అయ్యోరి రాజేశ్ (ధర్మపురి), బి.రాంసుధాకర్ రావు(గొల్లపల్లి), టి.గోపాల్ రెడ్డి(పెగడపల్లి), బి.సాగర్ రావు(జైనా), ఆర్.మధుకర్(నంచర్ల)ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా సహకార అధికారి సిహెచ్.మనోజ్ కుమార్ ఆయా సంఘాలను సందర్శించి సీఈవోలకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందించారు. దీంతోపాటు ఆయా పాలకవర్గాలకు సైతం వారం రోజులు సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు అందించారు. అలాగే ఆయా సంఘాల్లో జరిగిన పరిణామాలపై సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయాలని ఆదేశించారు. దీంతో ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గానికి సిఫారసు చేశారు.

నిధులతో అడ్డగోలు ఖర్చు..

అధికారుల అనుమతి లేకుండా పాలకవర్గాలు తీర్మానాలు చేస్తూ.. కోట్లాది రూపాయలతో సంఘ భవనాలు నిర్మించడం, గోదాములు నిర్మించడం, ధాన్యం కొనుగోలులో పరికరాలను మార్కెటింగ్ శాఖ అనుమతి లేకుండా కొనుగోలు చేయడం, ఇష్టారాజ్యంగా పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేయడం, భూములు కొనుగోలు చేయడం, సంఘం భవనాలను రిమోడలింగ్ చేయడం వంటి పనుల్లో అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. థర్డ్ పార్టీ సర్వే లేకుండా ఇష్టారాజ్యంగా సంఘాల నిధులు ఖర్చు చేశారని ఆరోపణలూ గుప్పుమంటున్నాయి.

అసలేం జరిగింది?

రాష్ట్ర సహకార కమిషనర్‌కు జిల్లాలో పలు సంఘాల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందింది. ఓ ముఖ్య నాయకుడు ఈ వ్యవహారంపై సీరియస్ అవడంతోనే ఈ ఫిర్యాదు ప్రభుత్వానికి చేరింది. దీంతో కమిషనర్ ఈనెల 9 ఫిర్యాదును స్వీకరించి, ఆయా సంఘాలపై విచారణ జరిపేందుకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన 8 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఈనెల 10 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈనెల 23న సహకార కమిషనర్‌కు నివేదిక అందించాయి.

సస్పెన్షన్ వాస్తవమే



జిల్లాలోని ఆరుగురు సీఈవోలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం వాస్తవమే. పాలకవర్గాలకు సైతం నోటీసులు జారీ చేయాలని సూచించింది. జిల్లాలో మరో రెండు, మూడు సంఘాలు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. వాటిపై కూడా త్వరలో చర్యలు ఉంటాయి.

– మనోజ్‌కుమార్, జిల్లా సహకార అధికారి, జగిత్యాల

కోరుట్ల ఎస్సై తీరే వేరు

- విచారణ పేరుతో చేయిచేసుకున్న వైనం
- ఎక్కడ విధులు నిర్వహించినా వివాదాస్పదమే..



ఎస్సై శ్వేత

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల ఎస్సై-2గా పని చేస్తున్న శ్వేత మరో వివాదంలో చిక్కుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిని అకారణంగా చితకబాదడంతో ఆయన అవమానంతో ప్రాణాలు తీసుకున్న తీరు ఆమె దురుసు ప్రవర్తనను మరోసారి బయటపెట్టింది. చేతిలో అధికారం, లాఠీ ఉన్నాయనో.. లేక పోలీసును.. నాకేమవుతుందన్న ధీమానో తెలియదు గానీ.. ఎక్కడ విధులు నిర్వహించినా జనాలను వేధించే అధికారిగా ముద్ర వేసుకోవడం మానడం లేదు. తాజా ఘటనలో ఓ అమాయకుడు ఎస్సై శ్వేత కారణంగా ప్రాణాలు తీసుకోవడంతో జిల్లా ప్రజలు పోలీసు శాఖపై మండిపడుతున్నారు.

కౌన్సెలింగ్‌కు బదులు లాఠీ ఝులిపించి?

మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్‌పై ఆయన భార్య కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె భర్తను విచారణ పేరిట ఎస్సై శ్వేత ఠాణాకు పిలిపించారు. భార్య ముందే లాఠీ ఝులిపించి, దూషిస్తూ అవమానించారు. ఈ నెల 23న ఉదయం ఇంట్లోనే శివప్రసాద్ పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. దీంతో ఎస్సై శ్వేతపై మృతుడి కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా తమ వాడిని పొట్టన పెట్టుకున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనూ ఇదే తీరు..

జిల్లాలోని పెగడపల్లి ఠాణాలో ఎస్సైగా పని చేస్తున్న సమయంలోనూ శ్వేత అదే మండలానికి ఓ ప్రజాప్రతినిధిని అప్పటి మంత్రి సమావేశంలో ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, చితకబాదారు. దీంతో మంత్రి ఆగ్రహించి, ఆమెను బదిలీ చేయించారు. ఎస్సై శ్వేత జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సమయంలో దరఖాస్తుదారులతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. మందలించాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆమె చెలరేగిపోతున్నట్లు తెలిసింది.

ఆర్టీసీలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్



వైద్యశిబిరానికి హాజరైన ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో ఆరోగ్యసూత్రాలు పాటించాలన్నారు. యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. ఉద్యోగుల కుటుంబీకులు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఆర్ఎం సుచరిత, ఇన్‌చార్జి డీఎం సురేశ్, టీఐ రాజేశం, రామకృష్ణ, రాంరెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వలంటీర్ల నియామకం



రెడ్‌క్రాస్ వలంటీర్లతో మాట్లాడుతున్న ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: స్వచ్ఛంద సామాజిక సేవ చేయాలనుకునే వారికి రెడ్‌క్రాస్ గొప్ప అవకాశమని ఆ సంస్థ చైర్మన్ గుడ్ల రవి పేర్కొన్నారు. గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లోని 30 మంది విద్యార్థులను రెడ్‌క్రాస్ వలంటీర్లుగా నియమించారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స, పరిసరాల పరిశుభ్రత వంటి సామాజిక సేవల్లో విద్యార్థి దశ నుంచే పాల్గొనాలని సూచించారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ ప్రయాకరావు వేణుకుమార్, రిటైర్డ్ ఎంఈవో వెన్నమనేని రాంచందర్‌రావు, గుడ్ల సునీల్, ఇరుకుల్ల భాస్కర్, పాఠశాల హెచ్‌ఎం లోకిని శారద తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి సదరం శిబిరాలు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అక్టోబర్ 4 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షల శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. వినికిడి, ఆర్థో, మానసిక వైకల్యం, కంటిచూపు తదితర వైకల్యాలను నిర్ధారిస్తారని చెప్పారు. అవసరం ఉన్న వారు సమీప మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. 4న ఆర్థో, కంటిచూపు పరీక్షలు, 22న వినికిడి, 23న మానసిక వైకల్యం, 24న ఆర్థో, వినికిడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

గోదావరినదిలో వ్యక్తి గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి నది సమ్మక్క గద్దెల సమీపంలో స్నానాల వాటిక వద్ద సుదర్శి బాలరాజు(29) అనే వ్యక్తి గురువారం గల్లంతయ్యారు. గోదావరిఖని టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. గోదావరిఖని చంద్రబాబు నాయుడు కాలనీలో నివసించే బాలరాజు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో స్నానాల వాటిక వద్దకు రాగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడ్డాడు. రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశ జిల్లా కాగా గోదావరిఖనిలో తాపీమేస్త్రీ పని చేసుకుంటూ నివసిస్తున్నాడు.

రేపు రుద్రంగిలో జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్/రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని రెడ్డీస్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణులైన యువత జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారికి సామర్థ్యాల ఆధారంగా నెలకు రూ.12వేల నుంచి రూ.40వేల వరకు వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల యువత తమ విద్యార్హతల పత్రాలు, జిరాక్స్ ప్రతులతో నేరుగా మేళాకు హాజరుకావాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట(మానకొండూరు): ఇల్లంతకుంట మండలం దాచారంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రి అంకుసాపురం గ్రామానికి చెందిన గౌరవేణి రాజు తన ట్రాక్టర్‌లో ఇసుకను దాచారం గ్రామానికి తరలిస్తుండగా పట్టుకొని, ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

సిరిసిల్ల: జిల్లాలో గురువారం మోస్తరు వర్షాలు పడ్డాయి. వీర్నపల్లిలో 28.6 మిల్లీమీటర్లు, బోయినపల్లిలో 25.9, రుద్రంగిలో 6.5, చందుర్తిలో 0.4, వేములవాడరూరల్‌లో 15.4, వేములవాడలో 6.4, సిరిసిల్లలో 0.7, కోనరావుపేటలో 0.2, ఇల్లంతకుంటలో 2.2, గంభీరావుపేటలో 0.2, ముస్తాబాద్‌లో 0.3, తంగళ్లపల్లిలో 0.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఎల్లారెడ్డిపేటలో పెద్దగా వర్షం పడలేదు.

అదుపు తప్పిన టెంపో

కొణిజర్ల: రహదారిపై గుంతలను తప్పించే క్రమంలో ఓ టెంపో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా పెను ప్రమాదం తప్పింది. వాహనంలోని ప్రయాణికులు తెలిపిన వివరాలు. కరీంనగర్‌కు చెందిన పది మంది ఏపీలోని అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి వెళ్లి గురువారం తిరిగి వస్తుండగా ఖమ్మం జిల్లా కొణిజర్ల – పల్లిపాడు మధ్య వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఆ పక్కనే పెద్ద గొయ్యి ఉండడంతో టెంపో డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలపడంతో ప్రమాదం తప్పినట్లయింది. పల్లిపాడు గ్రామస్తులు ట్రాక్టర్ సాయంతో వ్యాన్‌ను బయటకు తీశారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

సిరిసిల్లకల్చరల్: వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెకు చెందిన అంచ రాంరెడ్డికి అదే గ్రామానికి చెందిన రౌడీషీటర్లు కట్కూరి స్వామి, గంగుల శ్రీను, చింత శేఖర్‌లకు బావి పంచాయితీ విషయంలో తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో రాంరెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశ్యంతో శ్రీను, శేఖర్ కర్రలతో దాడిచేశారు. రాంరెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అప్పటి చందుర్తి ఎస్‌ఐ నీలం రవి కోర్టులో చార్జ్ షీట్ వేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

వామ్మో.. వన్యప్రాణులు



ఇది కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు శంకర్ వరిపొలం. పంట ఇప్పుడిప్పుడే ఈనుతోంది. ఈక్రమంలో వరిపొలంపై అడవిపందులు దాడిచేసి ధ్వంసం చేశాయి. అడవిపందుల కారణంగా వరిపొలం మొత్తం పనికిరాకుండా పోయింది.



మామిడిపల్లిలో ధ్వంసమైన పత్తి పంట

- పంటలపై దాడులు
- నష్టపోతున్న రైతులు
- నివారణ చర్యలు కరువు

కోనరావుపేట(వేములవాడ): పచ్చని పొలాలపై అడవి జంతువులు దాడి చేస్తున్నాయి. పొట్టకొచ్చే దశలో ఉన్న వరిపంటపై అడవిపందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. పత్తిమొక్కలను కోతులు పీకి పారేస్తున్నాయి. జిల్లాలోని కోనరావుపేటలో వన్యప్రాణుల దాడి తీవ్రంగా ఉంది. మండలంలోని ఎక్కువగా అటవీని ఆనుకున్న ఎక్కువ సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మునుపెన్నడూ లేనంతగా పంటలకు వన్యప్రాణులతో ముప్పు ఏర్పడుతోంది. పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలపై కోతులు దాడులు చేస్తుండడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని పరిహారం

అటవీ జంతుల దాడిలో పంటలు ధ్వంసమవుతున్నా బాధిత రైతులకు పరిహారం అందడం లేదు. కోనరావుపేట మండలంలో సుమారు 40 మంది రైతులకు చెందిన 60 ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయి. కోతులు, అడవిపందుల దాడిలో పంట నష్టపోయిన తమకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రెండెకరాలు నష్టపోయిన



నా రెండెకరాలలో వరి వేసిన. వరి పంటపై అడవి పందులు దాడిచేశాయి. మరి కొంత మంది రైతులపంటలు కూడా అడవిపందుల దాడిలో పనికిరాకుండా పోయాయి.

– మారుపాక లింబయ్య, నిమ్మపల్లి

పరిహారం రాదు



గ్రామాల్లో ఇటీవల అడవిపందులు, కోతుల దాడిలో పంటలు ధ్వంసమవుతున్నట్లు తెలిసింది. కోతులతో పంట నష్టం ఏర్పడితే పరిహారం రాదు. అటవీపందుల దాడితో జరిగి పంట నష్టానికి పరిహారం ఉంటుంది. వ్యవసాయాధికారులు, అటవీ అధికారులు విచారణ చేసి అంచనాలు పంపించాల్సి ఉంటుంది.

– శ్రీనివాస్, సెక్షన్ అధికారి, కోనరావుపేట

భక్తురాలు మృతి

ధర్మపురి: ధర్మపురి గోదావరి నదిలో పుణ్యస్నానాలకు వచ్చిన ఓ భక్తురాలు ప్రమాదవశాత్తు మృతిచెందింది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన కడారి భూలక్ష్మి(67) గురువారం గోదావరిలో స్నానం చేస్తుండగా కాలుజారి పడిపోయింది. మహాలక్ష్మి ఘాట్ వద్ద శవమై కనిపించింది. మృతురాలి అల్లుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తపై సమరం

- స్వచ్ఛ పరిసరాలే లక్ష్యంగా ముందుకు..
- సిరిసిల్లలో ఇంటింటా చెత్త సేకరణ
- పర్యవేక్షణ.. అవగాహన కార్యక్రమాలు
- చెత్త పడేసే వారికి జరిమానాలు
- ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి



మీరు చూస్తున్న ఈ చిత్రం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిత్యం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న ట్రాక్టర్. తమ ఇళ్లలోని వృథాను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ కార్మికులకు స్థానికులు అందిస్తున్నారు. ట్రాక్టర్, ఆటోలలో మున్సిపల్ సిబ్బంది చెత్తను మూడు రకాలుగా విభజించి సేకరిస్తుంటారు. 39 వార్డుల్లో నిత్యం 30 టన్నులకు పైగా చెత్తను సేకరించి డంప్‌యార్డుకు తరలిస్తున్నారు.



సిరిసిల్ల మానేరుతీరాన్ని శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బల్దియా పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకెళ్తోంది. స్వచ్ఛకీర్తిని నిలబెట్టుకునేందుకు బల్దియా చెత్తపై యుద్ధమే చేస్తుంది. మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. అక్టోబర్ 2 వరకు బల్దియా ఆధ్వర్యంలో «స్వచ్ఛత హీ సేవా» నిర్వహిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపై చెత్త పడేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. స్థానికుల్లో పరిశుభ్రతపై విద్యార్థులు, అధికారులు, సామాజిక సేవా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు.

పరిశుభ్రత..ప్రాధాన్యత

- ప్రథమశ్రేణి మున్సిపల్ సిరిసిల్లలోని 39 వార్డుల్లో 26 వాహనాలతో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. 26 రూట్లలో 80 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.
- 39 వార్డుల్లో 277 మంది శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారు.
- శానిటేషన్ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ పర్యవేక్షిస్తున్నారు.
- సిరిసిల్లలో ప్రతీ రోజు 12 టన్నుల వరకు ప్లాస్టిక్ చెత్తను సేకరిస్తున్నారు. పండుగ రోజుల్లో 20 టన్నుల వరకు చేరుతుంది.

స్వచ్ఛత హీ సేవా ప్రత్యేకత

సిరిసిల్లలో స్వచ్ఛతపై మున్సిపల్ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. నిషేధిత ప్లాస్టిక్ పదార్థాలైన ఇయర్‌బడ్స్, బుడగలు(బెలూన్స్), క్యాండీ, ఐస్‌క్రీం కోసం వాడే పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్‌బాక్సులు, ఆహ్వానపత్రికలు, సిగరేట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, పాలిస్టరీన్(థర్మాకోల్) 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉండే ప్లాస్టిక్ కవర్లను అమ్మకుండా వినియోగించకుండా చూస్తున్నారు.

సిరిసిల్ల మున్సిపల్ ప్రొఫైల్

పట్టణ జనాభా	1,09,850
వార్డులు	39
శానిటేషన్ సిబ్బంది	277
నిత్యం వెలువడే చెత్త	50 మెట్రిక్ టన్నులు
సేకరిస్తున్న చెత్త	48 మెట్రిక్ టన్నులు
నిత్యం వెలువడే ప్లాస్టిక్ చెత్త	12 టన్నులు

పౌరుల సహకారం బాగుంది



పరిశుభ్ర సిరిసిల్ల కీర్తి కొనసాగేలా చేపడుతున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పౌరుల నుంచి సహకారం బాగుంది. చెత్త, ప్లాస్టిక్ రహిత సిరిసిల్ల కీర్తికి మచ్చలు తెచ్చేవారిపై చర్యలు తీసుకుంటాం. రోడ్లపై చెత్త, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను పడేయరాదు. పాలకవర్గం సహకారంతో అక్టోబర్ 2 వరకు పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపడతాం.

– మీర్జా ఫసహత్ అలీబేగ్, మున్సిపల్ కమిషనర్